# చిరస్థాయి

గేలరీలోనూ, బయటా పెద్దకోలాహలంగా వుంది. గుంపులు గుంపులుగా వచ్చి జనం గేలరీలోని బొమ్మల్ని చూసి బయట మీటింగు దగ్గరకొచ్చి కూర్చుంటున్నారు.

ఆరోజు కొత్తగా కట్టిన రామారావు ఆర్ట్‌గేలరీకు మంత్రిగారు ప్రారంభోత్సవం చేస్తున్నారు.

ఒకపక్క బ్రహ్మాండంగా మీటింగు జరుగుతోంది. మీటింగులో అప్పారావు, వెంకట్రావు, భమిడిపాటి కామేశ్వరావువంటి ప్రముఖులంతా రామారావు కళానైపుణ్యాన్ని గురించి ప్రసంగిస్తున్నారు.

అక్కడ కూర్చున్నవారంతా కళాకారులు, కళాప్రియులు, కళాపోషకులు. వాళ్ళంతా రామారావు అద్భుత కళాప్రతిభకి, అతని కళాతృష్ణకు, అచంచల దీక్షకు ఆశ్చర్యపోతున్నారు.

పాతికేళ్ళప్రాయానికే పాశ్చాత్య విధానంలో విదేశీయుల్ని తలదన్నే అతని ప్రతిభను చూసి వేనోళ్ళ పొగడుతున్నారు.

సభలోనివారి హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. అంతా సగర్వంగా తలెత్తుకుని ఆలకిస్తున్నారు. అటువంటి కళాకారుడ్ని కన్నందుకు ఆంధ్రదేశం

పునీతమైందని మంత్రిగారు ప్రస్తావిస్తుంటే అక్కడవున్న అందరి హృదయాలూ సంతోషంతో ఉప్పొంగిపోయాయి.

ఎక్కడినుంచో ఒకామె వచ్చింది. జీవితంలో అరవైఏళ్ళు గడిపి ఎండిరాలిపోవడానికి సిద్ధంగావుంది. వడిలి వాలిపోయి ముడతలుపడి వికారమయిన శరీరంతో, చర్మాన్ని పొడుచుకొని ముందుకొచ్చి, జీర్ణదేహాన్ని చూపిస్తోన్న ఎముకలగూటితో ఆయాసపడుతూ నడవలేకనడవలేక కాళ్ళీడ్చుకుంటూ వచ్చి గేలరీచివర చీడీలమీద చతికిలబడింది.

ఒకరిద్దరు వచ్చీపోయేవాళ్ళు ఆమెను చూసి జాలిపడి చిల్లరడబ్బుల్ని ఆమెముందు పడేసి వెళ్ళిపోయారు.

ఆమెకు నవ్వొచ్చింది. 'నామీద వీళ్ళంతా జాలిచూపిస్తున్నారా' అనుకుంది. అక్కడనుండి ఆమె లేచి మీటింగుదగ్గరకు వచ్చి ఒకమూలవొదిగి కూర్చుంది. ఆమె వదిలివేసిన డబ్బుల్ని ఏరుకుని విచిత్రంగా ఒకమారు ఆమెకేసిచూసి తృప్తిగా వెళ్ళిపోయాడు ఓ ముష్టివాడు.

సభలో, రామారావు వ్యక్తిగత జీవితాన్ని గురించి ఆయన సోదరుడు మాట్లాడుతున్నాడు.

"చిత్రాల్లో ఊహించుకొనే రామారావు కాదు వాస్తవంలోని రామారావు. అతని చిత్రాల్ని చూసి మనం ఊహించుకున్నది అతనొక శృంగార పురుషుడని! కాని అందులో యథార్థంలేదు. అతను చాలా నిర్మలమైన, పవిత్రమైన జీవితాన్ని గడిపాడు. బాహ్యప్రలోభాలకు, ప్రాపంచిక సుఖానికి అతను ఎప్పుడూ తలొగ్గలేదు. ఒగ్గివుంటే అతను ఏనాడో పతనమైపోయివుండును. కాని అతను దేన్ని ఆదర్శంగా పెట్టుకున్నాడో ఆదర్శాన్ని నెరవేర్చడమే ప్రధాన కర్తవ్యంగా గలవాడు. అతను చిత్రించిన స్త్రీ రూపాల్ని గురించి ప్రజల్లో విపరీతార్థాలు ధ్వనిస్తుండేవి. అయినా అతను భయపడలేదు. సామాన్యుడిలా స్త్రీ సుఖాన్ని కాంక్షించినవాడు కాదు. కళాదృష్టితో సౌందర్యాన్ని చూసే ఒక గొప్ప వ్యక్తి..."

ఆ ప్రసంగం అంతా ఆమె వింది. 'అవును. అతను నిప్పులాంటి మనిషి. అనుకున్నది నెరవేర్చడంలో అతనిలా సూటిగా వెళ్ళేమనిషి మరొకరులేరు' అనుకుంది.

ఆ తర్వాత యిద్దరు ముగ్గురు మాట్లాడారు. వారంతా రామారావుని పొగుడుతున్నవాళ్ళే. ఆమె వాళ్ళ ప్రసంగాల్ని వినడంలేదు.

ఆమె హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతున్నట్టు తేలిగ్గా అయిపోయింది. గత జీవితమంతా ఆమె కళ్ళముందు ప్రతిఫలిస్తోంది. ఆరోజులు, ఆనాటి సంఘటనలు, అప్పటి తను-అన్నీ స్పష్టంగా ఆమె కళ్ళముందు నిలిచాయి. ఆమె బాహ్యాన్ని మర్చిపోయింది. గతించిన కాలాన్ని గురించి ఆలోచిస్తోంది.

ఒకరోజు ఉదయం ఆమె తలస్నానంచేసి తడిఆరని కురుల్ని వెనక్కునెట్టి బావినుండి కడవెత్తుకుని యింటికి బయలుదేరింది. శిరోజాల చివర్లనుండి నీటిబొట్లు మెల్లగా చెంపలమీదుగా జారుతున్నాయి. పచ్చటి శరీరంమీద ఎక్కడికక్కడ అంటుకుపోయిన తడిచీర-చీరలో ఇరవైయ్యేళ్ళ ఆమె-నీళ్ళకడవ భారంచేత బరువుగా, మందంగా నడుస్తూ సందుమలుపు తిరిగింది.

రామారావు అటే వస్తున్నాడు. బొంబాయిలో డిప్లమోపూర్తిచేసి ఉద్యోగం చెయ్యడం యిష్టంలేక, కళాసేవ చేయాలనే సంకల్పంతో స్వస్థలానికి తిరిగివచ్చి మూడు నెలలుగా ఊరంతా తిరుగుతున్నాడు. అతనికిప్పుడు కావలసినది అతని నైపుణ్యానికి పదునుపెట్టే స్త్రీరూపం!

మూడు నెలలుగా కాళ్ళు అరిగిపోయేట్టు ఊళ్ళో సందుసందునా తిరిగాడు. అతని అదృష్టంపండింది. ఆమె కనిపించింది. మెల్లగా వాకబుచేశాడు. స్వగ్రామాన్ని వదిలి యవ్వనపు తొలిరోజుల్లో ఒక పురుషుని అండను ఆశించి పట్నంవచ్చి వుంటున్నట్టు తెలిసింది.

రామారావు ఆవ్యక్తిని కలుసుకుని తన ఆశయం చెప్పాడు. రోజూ ఒకటీ రెండు గంటలు వచ్చిపోవడానికి నెలనెలా ఆమెకు జీతం యిచ్చేందుకు ఒప్పుకుని తన యింట్లో మేడమీద ముందరగదిలో స్టూడియో ఏర్పాటు చేసుకున్నాడు.

అక్కడే ఆ నాలుగు గోడలమధ్యా వందలకొద్దీ ఆమె చిత్రాల్ని చిత్రించాడు. అతను చెప్పినట్టుగా ఆమెనుంచునేది. ఆమెను అలా చూస్తూ ఆ ఆకారానికి లెక్కించలేనన్ని ప్రతిరూపాల్ని సృష్టించాడు. అతని కుంచెలు నునిశితత్వం అలవరచుకున్నాయి. అతని చిత్రాల్లో యధార్థత ప్రవేశించింది.

ఆమెను ఒకచోట తలవంచుకుని బరువుగుండెతో భర్తవెంట అరణ్యానికి వెళ్తోన్న సీతాదేవిని చేశాడు. మరోచోట పట్టుచీర గోచిపోసి చిన్నబాబుని వెంటబెట్టుకుని పూల పళ్ళేన్ని ఒకచేత్తో మోస్తూ ఆలయమండపంలో నుంచున్న కులకాంతలా సృష్టించాడు. ఇంకొకమారు రాజకుమారుడు సిద్ధార్థుని ముందు నిండుకొలువులో నాట్యంచేసి,

ఆయన తన సంతోషానికి చిహ్నంగా పారితోషికంగా యిస్తోన్న ముత్యాల హారాన్ని అందుకొంటున్న నాట్యకత్తె-వేశ్యను చేశాడు. అతను చేయని రూపం అంటూ లేదు. రాధగా, గోపికగా, విలాసినిగా, అమాయికగా, గృహలక్ష్మిగా-ఎన్నెన్నో రూపాల్ని కల్పించాడు. అనేకమారులు నగ్నంగా గంటలతరబడి, రోజులపాటు నుంచుంది. కాని అతను ఎలాటి భావోద్రేకాన్నీ, చిత్త చాంచల్యాన్నీ ప్రదర్శించలేదు. ఆమెకే ఆశ్చర్యంవేసింది. 'నిజంగా యితను మనిషికాడు. మనిషికి అతీతమైన ఏ శక్తో యితన్లో వుండివుండాలి' అనుకొంది.

ఆమె చిన్నప్పుడు చదువుకోలేదు. అయినా ఎదుటివాళ్ళను అర్థంచేసుకునే జ్ఞానం ఆమె అలవరచుకుంది. అతను ఆశయ సాధనకై పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొంటూ కష్టపడుతోంటే ఆమె అతని ఆశయానికి అడ్డునిలవలేదు. తన హావభావాల్ని అందచందాలకు జోడించి కవ్వించలేదు. నమ్రతతో అతనిని అధికారిగా భావించి ఒదిగివుండేది.

అలావుంటూ అతన్ని ఒక అత్యున్నత స్థానానికి తీసుకువెళ్ళడం ఆమె సంకల్పం. అందుకు ఆమె తన శక్తినంతా కూడదీసుకుని తననుతాను అదుపులో పెట్టుకుంది. ఆమెకు తెలుసు-అతను తప్పకుండా ముందుముందు వృద్ధిలోకి వస్తాడు. దేశం నలుమూలల్లో ఆయనపేరు మారుమ్రోగుతుంది. అతని చిత్రాలు విదేశమందిరాల్లో చోటుచేసుకుంటాయి. ఆ చిత్రాలు ప్రజల్లో ఒక నూతన చైతన్యాన్ని తీసుకొస్తాయి. తెలుగునాట ప్రజల్లో కళాభిరుచి మొగ్గతొడుగుతుంది. అతను సృష్టించిన చిత్రాలు ఒక విశిష్టతను సంతరించుకుని నిలిచిపోతాయి. తరతరాల జనం వాటిని చూస్తుంటారు. ఒకరోజున అతను తన ఎదుట నిల్చుని "చూశావా, యిదంతా నీవల్లనే" అంటాడు.

కాని నాలుగేళ్ళకన్నా ఎక్కువకాలం ఆమె అతనికి సేవచేసే భాగ్యం లేక పోయింది. ఇరవైఏడేళ్ళకే నూరేళ్ళు నిండిపోయాయి. మశూచి విజృంభించి అతన్ని తన వెంట లాక్కుపోయింది. అతని ఆశయాల సుతిమెత్తని చివుళ్ళను విధి తుంచిపారేసింది. అతని ఆఖరిరోజుల్లో ఆరిపోయే దీపం ఆఖరి వెలుతుర్లో ఆ కళ్ళల్లో తరిగిపోని కాంతుల్నీ, ముఖంలోని ప్రశాంతతనీ కిటికీ సందుల్లోంచి చూస్తున్నప్పుడు ఆమె మనసు ఎంతగానో విలవిల్లాడిపోయింది.

గాలిలోని దీపంలా వెలిగివెలిగి ఒకరోజున అతను కన్నుమూశాడు. ఆ కళ్ళు శాశ్వతంగా మూసుకుపోయాయి. ఆంధ్రప్రజలు దురదృష్టవంతులయ్యారు. ఆయన

యింకొంత కాలం జీవించగలిగివుంటే ఆంధ్రదేశమేకాదు భారతదేశంకూడా గర్వించివుండేది. కాని ఆ అదృష్టంలేకపోయింది. విద్యాభ్యాసం పూర్తిచేసి కళాసేవలో నాలుగేళ్ళు గడిపేనాటికే అతని జీవనకాలం పూర్తయ్యింది.

ఆమె జీవితానికూడా ఆనాడే అంధకారం వ్యాపించింది. ఆమె ఆశయాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. అతనికి చిరకాలం సేవచేయాలనే ఆమె కోరిక కోరికగానే నిలిచిపోయింది.

అతను చనిపోయాక అతని ప్రతిభని పొగిడి 'ఓహో?' అన్నారు ఆంధ్రప్రజలు. అతని పేరున పదాల్ని కూర్చి కమ్మగా పాటల్ని పాడారు. 'ఆంధ్రచిత్రకారుల్లో అగ్రగణ్యుడు మన రామరాయలు' అని అంతా ఒప్పుకున్నారు. ప్రజ నివాళి పట్టింది.

ఆమె కొంతవరకు ఊరడిల్లింది. అతని కలలు నిజమయ్యాయి. ఆమెకు కావలసినదికూడా అంతకన్నా యింకేమీ లేదు.అతని కీర్తిని చెవులారావింది. అలా విన్న రోజున హృదయంలోని భారాన్నంతటినీ వదుల్చుకుని తేలిగ్గా ఊపిరితీసింది.

ఒకరోజు ఆమె ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయింది. ఎక్కడకు వెళ్ళిందో, ఎందుకు వెళ్ళిందో ఎవరికీ ఏమీ తెలీదు. ఆమెమాత్రం అందర్నీ విడిచిపెట్టి దూరంగా—ఎవరికీ ఎప్పుడూ కనిపించనంత దూరంగా—వెళ్ళిపోయింది! ఆ జీవితం గురించి .... ఊహు.... ఆంధ్రప్రజలు తెలుసుకోగూడదు. ఆతర్వాత జీవితం ఎలాంటిదయినా దానితో మనకు సంబంధంలేదు. చంద్రకాంతిని పొగిడితే నిండు పున్నమి వెన్నెలనే పొగుడుతారుకాని చంద్రవంక మసక వెలుతుర్ని పొగడరు. ఒక సైంటిస్టు జీవితంలో సాధించిన విజయాల్ని బట్టి అతన్ని ఘనంగా చెప్పుకుంటారు కాని సాధించలేక ఓడిపోయిన తొలి సంఘటనల్ని ఎత్తిచూపి చేతగానివాడనరు. అంతే!- ఆమె జీవితంలో వెన్నెలరోజుల్ని మాత్రం మనం గ్రహించి మిగిలిన చీకటిదినాల్ని వదిలివేయాలి. అవి ఎలాంటివయినా వాటితో మనకు సంబంధం లేదు.

పాతికేళ్ళు గడిచాయి. ఆమెగురించి ఎవరికీ ఏమీ తెలీలేదు. ఆమెకూడా తన జీవితాన్ని ఎవరిముందూ విప్పిచెప్పి తన గొప్పతనాన్ని చాటుకోలేదు. గుప్తంగా అజ్ఞాతంగా వుండిపోయింది.

రామరావు వర్ధంతి రోజున కొత్త గేలరీకి మంత్రిగారు ప్రారంభోత్సవం చేస్తున్నారని, విశాలమైన పెద్ద హాలులో ఆయన చిత్రాలు అందంగా అలంకరించబడతాయని ఆమెవింది. తన కళ్ళతో యింతకాలానికి మళ్ళీ ఆ వైభవాన్నంతా చూడాలనుకుంది.

ఆతర్వాత ఆ అదృష్టం తనకు వుంటుందోవుండదో. కాలం తన మీద విరుచుకుపడింది. పరిస్థితుల ప్రాబల్యంవల్ల యాభైఅయిదేళ్ళకే పండు ముసలి అయ్యింది. శరీరంలో ఓపిక కూడా లేదు. చూపు ఓమాదిరిగా కనిపిస్తోంది. ఆలస్యం చేస్తే...ఏమో చెప్పలేం. చిన్నగాలికే అల్లల్లాడే పండుటాకు ఆయుర్థాయం ఎంతని చెప్పగలం?

అందుకే ఆమె ఎలాగో ఓపిక చేసుకుని నడవలేక తూలుతూ జోగుతూ వచ్చింది.

ఎవరో ఆమెను తోస్తున్నారు. ఆలోచనల్నుండి తేరుకొని అదుర్ధాగా లేచినుంచుంది. మీటింగు అయిపోయినట్టుంది మినిష్టరుగారు వెళ్ళిపోతున్నారు. వచ్చిన జనం తోసుకుంటూ గేలరీలోకి వెళ్తున్నారు.

ఆమెకూడా వాళ్ళతోపాటే లోపలికి వెళ్ళింది. అవే చిత్రాలు! అవే రూపాలు! ఆనాడు ఆయన గీసినవి చెక్కుచెదరకుండా అలానే వున్నాయి!

ఆ చిత్రాలన్నీ అచ్చంగా తనవేనా?

మరి ఆ సౌందర్యమంతా యిప్పుడేమయిపోయింది?

బింకంగా బలంగా వుండే రూపం ఏదీ ? ఉబ్బెత్తుగావున్న లేత గులాబీ ఎర్రదనం చెక్కిళ్ళు, నల్లగా నిగనిగలాడే శిరోజాలు, ముఖంలో జీవకళ-అవన్నీ ఏమయ్యాయి?

అవన్నీ కాలప్రవాహంలో కరిగిపోయాయి. పాతికేళ్ళకాలం వాటన్నిటినీ నిర్దయగా తననుండి లాక్కొంది. కాల సర్పం కోరలు చాచి సౌందర్యాన్నీ, రక్తాన్నీ పీల్చి శరీరాన్ని గుల్లచేసింది. ఒకనాటి తన అందం, ఆనాటి లావణ్యం క్రమ క్రమంగా రాలిపోయి యీనాటికి ఎందుకూ పనికిరాని యీ వికృతరూపం మిగిలింది.

ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆమెకు తెలీకుండానే రెండు కన్నీటి చుక్కలు కళ్ళల్లోనుండి జారిపడ్డాయి.

ఎవరూ అది గమనించలేదు. గమనించి వుంటే 'పిచ్చిదికాబోలు'అనుకునేవారు.

ఆమె కళ్ళువత్తుకుని ఒక చిత్రం నుండి మరో చిత్రం వద్దకు వెళ్తోంది. ప్రతీ చిత్రంలోనూ గతదినాలు ప్రతిఫలిస్తున్నాయి. వాటిని తలంచుకుంటూ కదలలేక కదలలేక మెల్లగా భారంగా ఒకొక్క చిత్రాన్నే చూసుకుంటూ వెళ్తోంది.

మధ్య మధ్య ఒక్కోచోట జనం గుంపులు గుంపులుగా నుంచుని చూస్తున్నారు. అక్కడ తన నగ్న చిత్రాలు వేలాడుతున్నాయి. ఆమెకు సిగ్గనిపించింది. తన సౌందర్యాన్ని యితరులు దోచుకుపోతున్నట్టు అనిపించింది ఆమెకు.

[library stamp]

చిత్రాల్ని చూస్తూ జనం రకరకాలుగా మాట్లాడుకొంటున్నారు. ఆమె అవన్నీ వింటోంది. ఆమె కళ్ళు ఆనంద భాష్పాలతో నిండిపోయాయి. ఆమె ఏదయితే చేయలేక పోయిందో అదే అతను చేసి చూపించాడు. తన అందాల్ని అద్దాల బీరువాలో బంధించినట్టుగా భద్రంగా దాచుకొని కాపాడుకోలేకపోయింది. కాని అతను అది సాధించాడు. కొన్ని వందల సంవత్సరాలవరకు చెక్కుచెదరకుండా తన సౌందర్యాన్ని భద్రపరిచాడు.

కొంతకాలానికి తను చనిపోతుంది.తన శరీరం, తన అందం మట్టిలో నామరూపాలు లేకుండా కలిసిపోతాయి. కాని చిత్రాల్లోని తనకు చావులేదు. ఆ చిత్రాలు వున్నంతకాలమూ తను వుంటుంది. ఖర్మవశాన కొన్ని వందల సంవత్సరాల తర్వాత ఆచిత్రాలు ఏమన్నా శిథిలమైతే ఆనాడుమాత్రం వాటితో పాటు తనూ శిథిలమవుతుంది. అంతవరకు ఆ చిత్రాల్లోని తనకూ , తన సౌందర్యానికీ చావులేదు.

ఆమె తృప్తిగా , సంతోషంగా మళ్ళీ మరొక్కమారు ఆ చిత్రాలన్నిటినీ చూసి మౌనంగా గేలరీ మెట్లుదిగి వీధిలోకి వెళ్ళిపోయింది.

ఆమె ఎవరినీ ఏమీ అడగలేదు . ఎవరితోనూ ఏమీ చెప్పలేదు. మౌనంగా వచ్చి మౌనంగానే వెళ్ళిపోయింది.

ఆమెను ఎవరూ గుర్తించినట్టులేదు . ఆమె ఒక అజ్ఞాత వ్యక్తి. ఒక అనామక సందర్శకురాలు .

అదే ఆమె కోరుకునేది.